# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 29-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ మార్కాపురం, పోలవరంలను కొత్త జిల్లాలుగా ఏర్పాటు చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- ❖ గ్రామ, వార్డు సచివాలయాలను స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డులుగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.
- ❖ మురికివాడల నిర్వాసితుల కోసం ఇళ్ల నిర్మాణాలు చేపడతామని మంత్రి పి. నారాయణ తెలిపారు.
- ❖ రాష్ట్రంలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా వెల్లడించారు.

====================

ఆంధ్రప్రదేశ్‌లో మార్కాపురం, పోలవరంలను కొత్త జిల్లాలుగా ఏర్పాటు చేస్తూ.. రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని రెవిన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్‌లతో కలసి అనగాని సత్యప్రసాద్ పాత్రికేయులకు వెల్లడిస్తూ... జిల్లాల పునర్విభజనపై మంత్రివర్గంలో సుదీర్ఘంగా చర్చించామని చెప్పారు. 17 జిల్లాలలో కొన్ని మార్పులు చేశామని, మిగిలిన 9 జిల్లాల్లో మాత్రం ఎలాంటి మార్పులు ఉండవని అన్నారు. రాజంపేట నియోజకవర్గాన్ని కడప జిల్లాలోకి మార్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. మదనపల్లె కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామని అనగాని సత్యప్రసాద్ వివరిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

====================

గ్రామ, వార్డు సచివాలయాలను స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డుగా మారుస్తూ.. రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అమరావతిలో పాత్రికేయులతో ఆయన ఈ రోజు మాట్లాడుతూ... గ్రామ, వార్డు సచివాలయాలను మరింతగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. సచివాలయాల విషయంలోనూ చాలా మార్పులు చేశామన్నారు. 50 వేల కోట్ల రూపాయలతో ఎన్టీఆర్ భరోసా పేరిట పింఛన్లు అందించామని తెలిపారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా ఇప్పటి వరకు 1,200 కోట్ల రూపాయలు వెచ్చించి రహదారులను నిర్మించామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

====================

మురికివాడ ప్రాంతాల నిర్వాసితుల కోసం ఇళ్ల నిర్మాణాలు చేపడతామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. విశాఖ నగరంలోని మురికివాడలలో మంత్రి ఈ రోజు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే అత్యధికంగా మురికివాడలు ఉన్న విశాఖ నగరంలో నిర్వాసితులకు తక్షణమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టే విధంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. సాధ్యమైనంత మేర ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

====================

రాష్ట్రంలో నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టిందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. 2025లో పోలీసుల పనితీరుపై నివేదికను ఆయన మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో ఈ రోజు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలకు రక్షణ కల్పించడంతో పాటు మత్తు పదార్థాల రవాణని సమర్ధంగా నియంత్రించగలిగామని చెప్పారు. సాంకేతికత ద్వారా నేరాలను మరింత తగ్గించేలా పోలీసులు చర్యలు తీసుకున్నారని తెలిపారు. రానున్న పదేళ్లలో పోలీసింగ్ ఎలా ఉంటుందనే దానిపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను జనవరిలో నిర్వహిస్తామని డీజీపీ వెల్లడించారు. పోలీసు విధులలో వస్తున్న మార్పులు, సాంకేతికతను అందిపుచ్చుకోవడంపైన ఈ వర్క్ షాప్ లో వివరిస్తామని తెలిపారు.

====================

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 17వ గిరిజన యువజన కార్యక్రమం విశాఖపట్టణంలో రేపటి నుండి నిర్వహిస్తున్నట్లుగా జిల్లా యువజన అధికారి ఎం. మహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా ఆరు జిల్లాలలో ఈ కార్యక్రమం జరుగుతోందని, అందులో భాగంగా విశాఖ జిల్లా కూడా ఆతిథ్య జిల్లాగా ఎంపికైందని చెప్పారు. వారం రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో తెలంగాణ, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, సిక్కిం, ఒడిశా రాష్ట్రాల నుంచి 200 మంది గిరిజన యువత పాల్గొంటారని తెలిపారు.

విరామం

====================

భారతదేశం 2025 సంవత్సరంలో రక్షణ రంగంలో సాధించిన పురోగతి పైన ఆకాశవాణి అందిస్తున్న ప్రత్యేక వార్తా కథనం...

రక్షణ రంగంలో గణనీయమైన ప్రగతిని సాధించడమే కాకుండా జాతీయ భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత్ ప్రపంచానికి చాటింది. పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా మే 7న పాకిస్థాన్ భూభాగంలోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై దాడి చేయడం ద్వారా తన రక్షణ సామర్థ్యాన్ని భారత్ నిరూపించుకుంది. మే 10న పాకిస్తాన్ వైమానిక స్థావరాలపై అత్యంత ఖచ్చితత్వంతో చేసిన దాడులు భారత రక్షణ రంగం పటిమను నిరూపించాయి. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా సహించేది లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని

కేంద్ర ప్రభుత్వం తన కఠినమైన నిర్ణయాల ద్వారా తెలియచేసింది. అణ్వస్త్రాలు పేరుతో చేసే బెదిరింపు చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేసింది. దేశ రక్షణ ఉత్పత్తుల ద్వారా ఆదాయం లక్షా 54 వేల కోట్ల రూపాయలు దాటిన ఏడాదిగా 2025 గుర్తుండిపోనుంది. 2025-26 సంవత్సరానికి ఆరు లక్షల ఎనభై ఒక్క వేల కోట్ల రూపాయలకు పైగా రక్షణ బడ్జెట్ ని కేటాయించడం ద్వారా దేశ భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం తన నిబద్ధతను చాటుకుంది.

====================

సముద్రంలో నాచు మొక్కల పెంపకాన్ని జిల్లాలో విస్తారంగా చేపట్టాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. మత్స్యశాఖ జిల్లా స్థాయి కమిటీ సమావేశం బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మత్స్యకారులకు అదనపు ఆదాయం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నాచు మొక్కల పెంపకం ప్రాజెక్టును ప్రారంభిస్తోందని చెప్పారు. దీంతో వారికి అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. యూనిట్ స్థాపనకు ప్రభుత్వమే నూరు శాతం రాయితీపై నిధులు కేటాయిస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు.

====================

ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను నూరు శాతం ఖర్చు చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరంజనేయ స్వామి అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఎస్సీ సబ్ ప్లాట్ నిధుల వినియోగంపై నోడల్ ఏజెన్సీ సమావేశం మంత్రి అధ్యక్షతన ఈ రోజు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల వినియోగంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. సాంఘిక సంక్షేమ శాఖకు సంబంధించిన విభాగాల అధిపతులు తప్పనిసరిగా నోడల్ ఏజెన్సీ సమావేశానికి హాజరు కావాలని మంత్రి ఆదేశించారు.

====================

అనకాపల్లి జిల్లా ఎలమంచిలి వద్ద ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో మంటలు చెలరేగిన ఘటన నేపథ్యంలో విశాఖ నుంచి విజయవాడ వైపు వెళ్లే పలు రైళ్లతో పాటు విశాఖకు రావాల్సిన మరికొన్ని రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. విశాఖ నుంచి విజయవాడ వైపు వెళ్లాల్సిన ఉదయ్ ఎక్స్‌ప్రెస్, పూరీ-తిరుపతి, ఈస్ట్‌కోస్ట్, బెంగళూరు హంసఫర్, షాలిమార్-చర్లపల్లి, విశాఖ-లింగంపల్లి, విశాఖ-గుంటూరు ఎక్స్ ప్రెస్ రైళ్లు 3 నుండి 4 గంటలు ఆలస్యమయ్యాయని రైల్వే అధికారులు పేర్కొన్నారు. రైలు ప్రమాదం నేపథ్యంలో పలు స్టేషన్లలో హెల్ప్‌లైన్ నంబర్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఏర్పాటు చేశారు.

====================

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ముస్తాబు కార్యక్రమంలో భాగంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు ముస్తాబు కిట్లను విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఈ రోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతీ విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాల్సిన అవసరం ఉందని అన్నారు.

====================

ఉపరితల ఆవర్తనం దక్షిణ కోస్తా జిల్లాల పరిసర ప్రాంతాలలో సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. రాష్ట్రంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు తెలిపారు. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర, దక్షిణ కోస్తా జిల్లాలలో రేపు, ఎల్లుండి పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించారు.

====================

====================